# సదా విధేయుడు

- కాండ్రేగుల శ్రీనివాసరావు

ఆనందరావుకి కొత్త ప్రదేశం అవటంవల్ల నిదురరావడంలేదు.

రాత్రంతా మంచమ్మీద అట్నుంచి ఇటువైపు ఇట్నుంచి అటువైపు బురదలో పొర్లుతున్న పందికి మల్లే వత్తిగిల్లుతూనే కాలక్షేపం చేశాడు.

మధ్యలో మంచమ్మీద లేచి కూర్చొని, నిద్రపోతున్న పిల్లలవంక, గుర్రుపెడుతున్న భార్య వంక చూస్తూ నిట్టూర్చాడు.

ఆకాలనీలో అద్దెవాటా తన భార్యకి అమితంగా నచ్చటంవల్ల యుద్ధ ప్రాతిపదికతో కాపురాన్ని తక్షణం మార్చేశాడు అందులోనికి. పగలంతా కొత్తింట్లో సామాన్లు సర్ది సర్ది అలసి గురకపెడుతూ నిద్రపోసాగింది సుబ్బలక్ష్మి. ఆనందరావుకి మాత్రం అవస్థలు తప్పలేదుమరి.

లేచి లైటువేసి వాల్‌క్లాక్ వంక చూశాడు. నాలుగున్నర కావొస్తుంది. కాసేపు వ్యాయామం చేస్తే బాగుణ్ణనిపించింది. కానీ రాత్రంతా నిద్ర లేకపోవడంవల్ల నీరసంగా ఉండడంతో బద్ధకించేశాడు. చీపుర్లుతో వాకిలి వూడ్చుతున్న శబ్ధాలు బయటనుంచి వినిపిస్తూంటే వీధి మేల్కొంది అనుకున్నాడు.

కాసేపు అలాగే గడిపి, తలుపు తీసుకుని అరుగుమీదకొచ్చి కూర్చున్నాడు. వీధిలోంచి వెళ్లిపోతున్న పేపర్‌బోయ్‌ని పిలిచి, పేపరొహటి కొనుక్కుని అరుగుమీద చతికిలబడి చదవసాగేడు.

తెల తెల్లవారుతుండగా ఇళ్లలోంచి పురుష పుంగవులు, బిందెలూ, బాల్చీలూ చేతబట్టుకుని బోరింగ్ దగ్గరకు నడవసాగేరు. ఆనందరావువైపు విస్మయంగా చూసి వాళ్లలో వాళ్లే ఏదో మాట్లాడుకోసాగేరు.

పేపర్‌లోంచి మొహం పైకెత్తి ఆనందరావు వాళ్లవైపు పరిశీలనగా కాసేపు చూసి మళ్లీ పేపర్‌లో మొహం దూర్చేసుకున్నాడు.

పురుష పుంగవులంతా బోరింగ్ దగ్గర కబుర్లాడుకోసాగేరు.

'గురుడు కొత్తగా వచ్చినట్లుంది'

'అవును. నిన్నే దిగారు ఇంట్లో...'

'అయితే మన వీధి సంగతి ఇంకా తెలిసినట్లు లేదు.'

'తెలియకే కదా! తీరికగా కూర్చొని పేపర్ చదువుకుంటున్నాడు.'

'పాపం పక్షి సరిగ్గా వచ్చిపడ్డాడు మన వీధిలోకి.'


'నే వెళ్లి మాట్లాడి వస్తాను. మీరంతా పనిచూడండి ముందర...'

'నువ్వు జారేయటానికి ఇదో నెపం. కుదరదు. వర్క్ ఈజ్ వర్‌షిప్...'

పేపర్ పక్కన పడేసి పరిసరాలు పరికించసాగేడు ఆనందరావు.

ఆ వీధిలో మగాళ్లంతా చకచకా పనులు చేసుకెళ్లిపోవటాన్ని గమనించాడతడు. ఆడాళ్లెవరూ వీధిలో అగుపించడంలేదు. కొందరు మగాళ్లు బిందెలుతోనూ బాల్చీలతోనూ నీళ్లు మోస్తున్నారు. మరికొందరు పాలపేకట్లు తెస్తున్నారు. ఇంకొందరు ఉతికిన బట్టల్ని మేడమీద ఆరేస్తున్నారు. ఈల పాటలతోనూ, కూనిరాగాలతోనూ, శ్రమే తమ జీవన విధానం అన్నంత ఉత్సాహంగా చేసుకుపోతున్నారు వాళ్లంతా.

అలాంటి పరిస్థితులలో తనొక్కడు వీధిలో కూర్చోవటం ఇబ్బంది అనిపించి ఇంట్లోకి వచ్చేశాడు. ఎప్పుడు లేచిందో సుబ్బలక్ష్మి, వంటింట్లో కాఫీ కలపడంలో నిమగ్నమై ఉంది. పిల్లలిద్దరూ బాత్రూమ్‌లో బ్రష్ చేస్తున్నారు.



సరిగ్గా అంతలోనే వచ్చింది ఎదురింటి ఆండాళ్లమ్మగారు.

'ఏవయ్యా! ఆనందూ.. మగవాళ్లంతా చక్కగా పనిచేసుకుంటూపోతే నువ్వొక్కడివి సోమరిపోతులా ఉండడం ఏమయినా బావుందయ్యా? మా కాలనీకి ఎంత మర్యాద తక్కువో తెలుసా? నీగురించి నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటూంటే విని వచ్చాను' అంది ఆమె.

ఆనందరావు అయోమయంగా చూశాడు ఆమెవైపు.

'మా ఆయన లుంగీతో వీధిలోనికే వెళ్లరు పిన్నిగారూ! అలాంటిది నీళ్లకోసం బోరింగు దగ్గరకి వెళ్లడమే? నా తిప్పలేవో నేను పడతానులెండి' సుబ్బలక్ష్మి ముక్కు చీదుకుంది.

'అలాగంటే కుదరదమ్మాయ్! మా కాలనీకి కొన్ని రూల్స్ ఉన్నాయి. అవి మీకు నచ్చినా నచ్చకపోయినా వాటిని తప్పక పాటించాల్సిందే' స్థిరంగా చెప్పింది ఆండాళ్లమ్మ.

ఆనందరావుకి విషయం కొంచెం కొంచెం అర్థమవసాగింది. తను ఈకాలనీకి వచ్చి తప్పుచేశాడా? అని (వచ్చి అర్ధవై నాలుగు గంటలు కాకముందరే) తనని తాను

ప్రశ్నించుకున్నాడు. ఏది ఏమైనప్పటికీ ఈ కాలనీ గురించి తెలుసుకోవల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది అని గట్టిగా మనసులో తీర్మానించుకున్నాడు.

ఆ మరుసటి దినం తెల్లవారుజాము నాలుగు కావొస్తుండగా మెలకువ వచ్చింది ఆనందరావుకి. వాకిలిని వూడ్చే చీపుర్లు చప్పుడు గురించి మెలకువగా ఉన్నాడు. అంతలో ఆ చప్పుళ్ళు నిర్ణీత సమయానికే వినిపించసాగాయి. ఇక క్షణం కూడా ఆలస్యం చేయకుండా లేచి గదిలో లైటు వేయకుండా కిటికీ దగ్గర నిల్చొని వీధిలోనికి చూడసాగేడు.

మోకాళ్ళవరకు లుంగీలు ఎగ్గొట్టి, (పోలిక దొరకకుండా ఉండటానికి కాబోలు) తలకు తువ్వాళ్ళు చుట్టి, బరాబరామని వీధి వాకిలిని వూడ్చేస్తున్నారు మగపుంగవులు. బోరింగ్ దగ్గర బట్టలుతికే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు ఇంకొందరు.

వాళ్లపై జాలి, ఆ వెంటనే కోపం కలిగినయి ఆనందరావుకి.

ఇంతలో ఆండాళ్ళమ్మగారు లేచి, చుట్టుపక్కల ఇల్లు తిరిగి పదిమందిదాకా ఆడాళ్లని సమకూర్చుకుని, అవీ ఇవీ మాట్లాడుకుంటూ మార్నింగ్‌వాక్‌కి బయల్దేరారు.

ఆనందరావుకి వాళ్ల దినచర్య అర్థం అయిపోసాగింది.

ఆడాళ్లు మార్నింగ్‌వాక్‌కెళ్లి తిరిగొచ్చేసరికి, ఇంట్లో నీళ్లు పట్టేసి, పాచిపనులు, కళ్లాపిలు పూర్తిచేసి వాళ్లకి వేడి వేడి కాఫీయో, టీయో అందించటం మగపుంగవుల పని.

ఛీ.. స్వేచ్ఛలేని జీవులు, ఆడంగి వెధవులు, అని తిట్టుకుంటూ వాళ్ల గురించి ఆలోచిస్తునే నిద్రలోనికి జారిపోయాడు ఆనందరావు. శరీరాన్ని ఎవరో 'తట్టి' కాదు కాదు 'కొట్టి' లేపుతూంటే మెలకువ వచ్చింది అతడికి.

ఎదురుగా ఆండాళ్లమ్మ చేతిలో బాల్చీ పట్టుకుని నిల్చుంది.

'ఆనందూ ఈవ్వాళ ఇంట్లోకి సరిపడే నీళ్లని తెచ్చేదాక నేను ఇక్కడే ఉంటాను' అంది. అంతే! ఆనందరావుకి పై ప్రాణాలు పైనే పోయాయి. శూన్యంలోకి వెర్రిగా చూస్తూ ఉండిపోయాడు.

'లే నాయనా ఈవ్వాళ్లికి తప్పదు మరి' హెచ్చరించింది ఆండాళ్లమ్మ.

ఆనందరావుకి ఆ సమయాన కత్తిగానీ దొరికి ఉంటే కసితీరా ఆమెని పొడిచేసి ఉండేవాడు.

మంచమ్మీద నుంచి అతి కష్టంగా లేచి, లుంగీ బిగించి కట్టాడు. ఉక్రోషం లోపల్నుంచి తన్నుకొస్తుంటే తమాయించుకున్నాడు.

'ఇదిగో ఆండాళ్లమ్మ.. ఇప్పటిదాకా నేను అజాత శత్రువుని. ఇప్పుడు నా ప్రత్యర్థివి నువ్వే. ప్రపంచ భార్యా బాధితుల సంఘం అంటూ ఒహటి పెట్టకపోతానా.. నీతో తలపడకపోతానా.. నీ అంతు చూడకపోతానా ఇదే నా శపథం...' లోలోపల పళ్లు నూరుతూ అనుకున్నాడు.



ఉస్సురంటూ బాల్చీ తీసుకుని వీధిలోనికి నడిచాడు.

కసాయితో కమేలాకి వెళ్తున్న గొర్రెలా ఉంది అతడి పరిస్థితి.

బోరింగ్ దగ్గర అప్పటికే అయిదారుగురు ఉన్నారు.

అతడు తన బాల్చీని సీరియల్‌లో ఉంచి, రాని నవ్వుని మొహానికి పులుపుకుని ఇకిలించాడు. 'హలో.. అయామ్ ఆనందరావ్.. కలక్టరేట్‌లో సెక్షన్ సూపర్నెడెంటుగా పనిచేస్తున్నాను. ఈకాలనీకి వచ్చి రెండు రోజులౌతూంది' తనని తాను పరిచయం చేసుకున్నాడు.

వాళ్లు కూడా ఆనందరావుని సాదరంగా ఆహ్వానిస్తు తమ పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశ్చర్యపోయాడు ఆనందరావు. వాళ్లంతా పెద్ద పెద్ద ఆఫీసర్స్. తన కన్నా మంచి హోదాలో ఉన్నారు. అలాంటి వారి పరిస్థితి చూసి దిగులేసింది అతడికి. భారంగా నిట్టూర్చాడు.

నీళ్లు తేవటం ఆనందరావు దినచర్యలో భాగమైపోయింది.

ఆరోజు సెలవు పెట్టేసి తన బతుకు గురించి పునరాలోచించుకోసాగేడు. ఎలా ఉండేవాడు ఎలాగైపోయాడు తను. తృప్తిగా నవ్వుకుని ఎంతకాలమయ్యిందో కదా? ఎంత గారాభంగా పెరిగాడని తను. అమ్మా నాన్నా తనని మహారాజులా పెంచారు. అలాంటి తన బ్రతుకు బిందెలూ, బాల్చీలూ, బోరింగు పాలైపోయింది. మధ్యలో ఈ ఆండాళ్లమ్మ ఒకత్తె తన ప్రాణానికి. ఏ జన్మనాటి శతృత్వమో? ఈ జన్మలో ఆండాళ్లమ్మ రూపంలో తనని పీడిస్తోంది.

మంచమ్మీద వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో సుబ్బలక్ష్మి ఆ గదిలోకి వచ్చింది.

## నాగార్జున కెరీర్



నాగార్జునకు బ్యాడ్ పీరియడ్ నడుస్తోంది. అన్నమయ్య తర్వాత నాగార్జునకు ఒక్క హిట్ కూడా లేదు. ఆయన లేటెస్ట్ సినిమా 'రావోయి చందమామ' కూడా ఫ్లాపయింది. తన వరుస ఫ్లాపులకు నాగార్జున పెద్దగా కంగారుపడడం లేదు. అయితే ఆయన బాధల్లా నిర్మాతగా తను సక్సెస్ కాలేకపోతున్నాననేనట. 'సీతారాముల కల్యాణం చూతము రారండి' తర్వాత ఆయన తన 'గ్రేట్ ఇండియా' బ్యానర్ మీద తీసిన 'సీతారామరాజు' కూడా ఫ్లాపయింది. దాంతో నాగార్జునకు చేతులు కాలాయి. అందువల్ల సొంత సినిమా నిర్మాణం పట్ల ఆయనకు ఆసక్తి తగ్గిపోయిందని వినికిడి. అయినా ప్రస్తుతం సినిమా నిర్మాణం విషయంలో వెనక్కు తగ్గకూడదని కూడా మరోవైపు ఆయన అనుకుంటున్నాడట. ఆయన అలా అనుకోవడానికో కారణం వుంది. ఎన్ని ఫ్లాపులు వచ్చినా ప్రస్తుతం నాగార్జున డైరీ బిజీగానే వుంది. తన రెమ్యూనరేషన్ని సొంత సినిమా నిర్మాణానికి ఖర్చుపెడతాడు. అంతేకదా?

-జె.వి. బాబు

'అయ్యో పడుకున్నారేమిటండీ? తలనొప్పిగా ఉందా?' మంచమ్మీద ప్రక్కన కూర్చుంటూ అడిగింది.

కాదని తల అడ్డంగా వూపి, ముభావంగా ఉండిపోయాడు అతడు.

'ఏవండీ..' గారాలుపోతూ పిల్చింది.

'ఆ!..'

'ఎదురింటి అప్పారావు లేడూ..'

'ఎందుకు లేడూ, ఉండే చచ్చాడు కదా..'

'ఇంటిపని అంతా అతడే చేసుకుపోతాడటండీ!' చెప్పింది సుబ్బలక్ష్మి ఉత్సాహంగా.

'అలాగా?' కాస్త కోపంగా అన్నాడు.

'పక్కింటి పాపారావు అయితే వంట కూడా అతనే చేస్తాడటండీ!'

భార్య చెబుతున్నది వింటూంటే వళ్లు మండిపోతున్నది ఆనందరావుకి.

'వెనుకింటి వెంకట్రావు అయితే చీరలు దగ్గర్నుంచి లంగాలుదాకా అతనే ఉతికేసి నీటుగా ఇస్త్రీ కూడా చేసేస్తాడటండీ...'

ఆనందరావుకి నెక్ట్స్‌సీను ఏమిటో చూచాయిగా అర్థం అవసాగింది. లోపల్నుంచి కోపం తన్నుకొస్తుంది.

'ఏవండీ! ఈ కాలనీ... ఈ మనుష్యులూ ఎంత మంచివారో కదండీ! మీరు కూడా రేపట్నుంచి..' ఆమె మాట ఇంకా పూర్తి చేయకముందరే ఆనందరావు ఆవేశంతో వూగిపోసాగేడు.

'చంపేస్తాను. నువ్వింకో మాట అన్నావంటే చంపేస్తాను' అరిచాడు గట్టిగా.

భర్తలో ఎప్పుడు కూడా అంత కోపం చూసి ఉండని సుబ్బలక్ష్మి భయంతో వంటింటిలోనికి పారిపోయింది.

కాలు కాలిన పిల్లిలా ఆనందరావు అటూ ఇటూ తిరగసాగేడు.

లాభంలేదు. ఏదో ఒహటి చేయకపోతే లాభం లేదు. పరిస్థితి విషమించక ముందరే ఏదో ఒహటి చేయాలి. ఆలోచించగా ఆలోచించగా అతడి మెదడులో ఓ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దాంతో స్థిమితపడ్డాడు.

మరుసటి ఉదయాన్ని బోరింగ్ దగ్గర–

'ఫ్రెండ్స్! నేను మీ కాలనీకి కొత్తగా వచ్చిన సందర్భంగా మీకందరికీ పార్టీ ఇవ్వబోతున్నాను. సాయంత్రం అయిదింటికి మీరందరూ హోటల్ సుధాకి వచ్చేయండి. మనవాళ్లందరికీ నా పిలుపుగా చెప్పండి. ఎవరూ మిస్ కాకూడదు...' చెప్పాడు.

అనుకున్నట్లుగానే హోటల్ సుధా రెస్టారెంట్‌లో అందరూ కలుసుకున్నారు. ఎవరెవరికి ఏం కావాలో, అడిగి మరీ, ఆర్డర్ ఇచ్చాడు ఆనందరావు. వాళ్లంతా అదీ ఇదీ మాట్లాడుకుంటూ బొతాఖానీలో పడ్డారు.

ఈ ఆడంగి వెధవుల్లో రెవల్యూషన్ తేవాలి. అందుకోసమే తను ఈ పార్టీ ఎరేంజ్ చేశాడు. 'ఆండాళ్లమ్మ! నీ కాలనీలోనే నీకు వ్యతిరేక వర్గాన్ని తయారు చేయబోతున్నాను. నా తఢాకా ఏవిటో చూపిస్తాను' స్వగతంలో అనుకున్నాడు.

'ఫ్రెండ్స్! పార్టీకి విచ్చేసిన మీ కందరికీ నా శుభాకాంక్షలు! మనం అంతా సోదరులం. మంచి హోదాలో ఉన్నటువంటి మిమ్మల్నంతా చూస్తుంటే నాకెంతో గర్వకారణంగా ఉంది. కానీ ఒకే ఒక్క విషయంలో మాత్రం అవమానంగా ఉంది. మీరంతా సహృదయంతో అర్థం చేసుకుంటారనే ఆశిస్తున్నాను.

మనమంతా భార్యలకి విధేయులుగా ఉండడం ఎందుకు? మనపైన ఆండాళ్లమ్మగారి పెత్తనం ఎందుకు? మనలో తిరుగుబాటు ధోరణి రావాలి. కాబట్టి రేపు ఉదయం మీరంతా ఉమ్మడిగా బోరింగ్ దగ్గరకు నీళ్లకి వెళ్లటం మానేయాలి. దాంతో వాళ్ల పనులు వాళ్లే చచ్చినట్లు చేసుకుంటారు. కాబట్టి కామ్రేడ్స్! మీరంతా నాతో సహకరిస్తారని ఆశిస్తున్నాను' అని ముగించాడు ఆనందరావు.

చప్పట్లతో హాలు అంతా మారుమ్రోగిపోతుందని ఆశించాడు. కానీ అట్నుంచి ఎటువంటి రెస్పాన్స్ కనిపించలేదు.

ఇంతలో ఒకాయన లేచి–


'ఆనందరావుగారు మన కాలనీకి కొత్తకావటంవల్ల అతనికి విషయ పరిజ్ఞానం ఏమాత్రం కూడా లేదు. భార్యల మాట వినొద్దని అతను చెప్పడం ఏమీ బాగా లేదు.

ఉదాహరణకి నన్నే తీసుకోండి. నాది పెద్ద కుటుంబం. తమ్ముళ్లు, చెల్లాయిలతో, అమ్మానాన్నని సైతం నేనే పోషించాల్సివచ్చేది. నా భార్య సలహాతో వాళ్లందర్నీ వదిలేసి వేరే కాపురం పెట్టాను. రెండేళ్లలో రెండు ఫ్లాట్లే కాకుండా నా భార్యకి నగానట్రా చేయించాను కూడా...'

మరొకాయన లేచి చెప్పసాగేడు

'నేనూ అంతే! నా భార్య చెప్పింది వింటున్నాను కాబట్టే ఆర్థికంగా నిలదొక్కుకుని ఈ స్టేజికి ఎదిగాను.

నేను ఉద్యోగం చేసి సంపాదిస్తుంటే, నా భార్య వడ్డీ వ్యాపారం చేసి సంపాదిస్తోంది. మన భార్యలు మన మేలు కోరేవారే కదా! వాళ్ల మాటవిని మనం బాగుపడుతున్నామేగానీ చెడిపోవటం లేదుకదా! మరి ఆనందరావు విప్లవం వర్ధిల్లాలి అని ఎందుకు అంటున్నాడో నాకు అర్థం కావడంలేదు' ముగిం



చాడు అతడు.

ఆనందరావుకి అర్థం అవసాగింది. తను పార్టీకోసం ఖర్చుపెట్టిన నాలుగువేల రూపాయలూ నిష్ప్రయోజనమయ్యాయని అతనికి స్పష్టంగా తెలిసిపోయింది. ఈ బడుద్ధాయిల నరనరాల్లోనూ పెళ్లాంపట్ల విధేయత జీర్ణించుకుపోయింది. ఈ వెధవల్ని మార్చటం తన వల్లకాదు. ఇక క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే పార్టీ ముగించేసి ఇంటికొచ్చేశాడు.

ఇంటికైతే వచ్చాడుగానీ, ఆండాళ్లమ్మ గురించి భయపడుతూనే ఉన్నాడు. ఈ సంగతి ఆమెకి తెలిసిందంటే ఇంకేమైన ఉందా? భూకంపం వచ్చేయదూ?

ఏదైతే జరగకూడదనుకున్నాడో అదే జరిగింది.

'ఒసేయ్ సుబ్బూ.. నీ మొగుడు ఏం ఘనకార్యం చేశాడో తెలిసిందా?' అంటూ వీధిలోంచి ఆండాళ్లమ్మ అరుస్తూ వస్తూంటే క్షణం కూడా ఆలస్యం చేయకుండా దొడ్డిదారి వెంబడి పెరట్లోకి వచ్చేసి, గోడ దూకి మరీ పరుగుతీశాడు.

రోడ్డుమీద కాసేపు అటూ ఇటూ పచార్లు చేసి తరువాత ఏం చేయాలో పాలుపోక దగ్గరలో ఉన్న దేవాలయంవైపు నడిచాడు.

ఆనందరావు అక్కడికి చేరేసరికి వేదికమీద కాషాయవస్త్రధారి భక్తిమార్గం గురించి ఉపన్యసిస్తున్నాడు. కూర్చోని శ్రద్ధగా వింటున్న భక్తబృందం వెనుక ఆనందరావు కూడా చతికిలబడ్డాడు.

'.. కనుక.. మనకున్న జీవితం చాలా స్వల్పమైనది. మానవ జీవితమే బుద్బుదప్రాయం. కాబట్టి ఈ స్వల్పకాల జీవితంలోనే మనం భక్తిమార్గాన్ని...'

– అతని ప్రసంగం వినగానే ఆనందరావుకి రోషం ముంచుకొచ్చింది.

'ఒరే! సన్యాసీ! మానవ జీవితం స్వల్పమైనదా? పెళ్లిచేసుకుని చూడు. అది ఎంత సుధీర్ఘమైనదో, ఎంత బాధాకరమైనదో నీకే తెలుస్తుంది' వెనుక నుంచి అరిచాడు.

దాంతో కాషాయవస్త్రదారి నివ్వెరపోయాడు.

వలంటీర్స్ వచ్చి ఆనందరావు మీద చేయి చేసుకున్నంత పని చేశారు.

'పాపం వదిలేయండి. మతి భ్రమించిన పిచ్చివాడులా ఉన్నాడు' అంటున్నారు మరెవరో. ఆ ప్రాంగణం నుంచి ఆనందరావుని బరాబరా ఈడ్చి గెంటేశారు.

ఆనందరావుకి ఆనందమే కరువైపోయింది. తిరిగి తిరిగి వీధి సద్దుమనిగేక ఇల్లు చేరాడు. మనస్సంతా చికాకుగా ఉంది. ట్రాన్సిస్టర్ తీసి ఏ వల్లకాటి సంగీతమో ఆలకిస్తు రిలాక్సు అవుదామని వెళ్లి ఆన్ చేశాడు.

'పెళ్లాం చెబితే వినాలి..

ఇల్లూ వాకిలి తుడాలి..' ఏదో సినిమాపాట వస్తోంది.

రేడియోని నేలకేసి కొట్టాలనే ప్రయత్నాన్ని అతి బలవంతమ్మీద ఆపుకున్నాడు.

టీవీ దగ్గరకెళ్లి తనకిష్టమైన ఛానెల్ పెట్టుకుని చూడసాగేడు. అందులో వార్తలు వస్తున్నాయి.

'ఈరోజు వార్తలలో ముఖ్యాంశాలు. అర్ధాంగితో ప్రధాని విహారయాత్ర.. ముఖ్యమంత్రి భార్య తెరవెనుక రాజకీయాలూ.. ప్రతిపక్షాల వాకౌట్.. మహిళలుకి మరిన్ని రిజర్వేషన్ సదుపాయాలు తదితర అంశాలు...'

ఇక వినలేకపోయాడు ఆనందరావు. పిచ్చెక్కినట్లు జుత్తు పీక్కున్నాడు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. మర్నాడు ఉదయాన్నే ఆండాళ్లమ్మ పాదాలపైపడి క్షమించమని వేడుకున్నాడు. ఆమె క్షమాబిక్ష ప్రసాదించేసరికి ఉరిశిక్ష రద్దు అయిన ఖైదీలా ఆనందంతో తబ్బిబ్బి అయ్యాడు.

ఆఖరిసారిగా ఒకే ఒక ప్రయత్నం చేశాడు. ఆ కాలనీ నుంచి తను ఇల్లు ఖాళీ చేసేయాలి. ఆఫీసుకి కాస్త దూరమైనా, ఇరుగూ పొరుగూ లేని వంటరి ఇల్లునొకదానిని చూసి అద్దెమాట్లాడుకుని అడ్వాన్స్ ఇచ్చి కుదుర్చుకున్నాడు. ఆండాళ్లమ్మకి, ఆ కాలనీకి కలిపి కొబ్బరికాయ కొట్టేసి సంతోషిద్దామనుకున్నాడు. ఈ విషయం భార్యకి రహస్యంగా చెబుదామని ఇంటికి ఆదరాబాదరాగా వచ్చేడు.

'ఏవండీ! ఏవండీ! మీకో శుభవార్త! మన హౌస్ ఓనర్‌గారు ఈవ్వాళ వచ్చారండీ! ఆండాళ్లమ్మగారు దగ్గరుండి, పది నెలలు అద్దె అడ్వాన్స్‌గా నాచేత ఆయనకు ఇప్పించి నాలుగేళ్ళ వరకూ ఖాళీచేసే ప్రసక్తి లేదని ఖచ్చితంగా చెప్పేశారండీ! ఆయన సరే నన్నారు.

పోనెండి అద్దె కొంపలు బాధ ఇక మనకి లేనట్లే! ఈ కాలనీవాళ్లు ఎంత మంచివాళ్లో కదండీ! చెప్పింది సుబ్బలక్ష్మి.

కళ్లు బైర్లు కమ్మడంతో దబ్బుమని పడిపోయాడు ఆనందరావు.

ఆనందరావులో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది.

రెండు నీళ్ల బాల్చీలను అవలీలగా మోసేయగలడు.

బండెడు బట్టల్ని అరగంటలో ఉతికేయగలడు.

గచ్చులన్నింటినీ అయిదు నిమిషాలలో తుడిచేయగలడు. అన్నిటికన్నా ముఖ్యంగా సుబ్బలక్ష్మిపట్ల సదా విధేయుడై ఆండాళ్లమ్మగారి ఆశీస్సులు నిరంతరం అందుకుంటూనే ఉన్నాడు.

★

## చేతిముద్ర



''నేరస్థుడి చేతిముద్ర దొరికిందా?'' అడిగాడు ఇన్స్‌పెక్టర్.

''పూర్తి చేతిముద్రే దొరికింది సార్!'' అన్నాడు కానిస్టేబుల్.

''అయితే వెంటనే దాన్ని మన జ్యోతిష్కుడిగారికి చూపించి వాడెప్పుడు దొరుకుతాడో చెప్పమను!'' అన్నాడు ఇన్స్‌పెక్టర్.

## కుటుంబం

''మా అమ్మాయిని పెళ్ళాడుతానంటున్నావు. సరే.. కాని కుటుంబాన్ని పోషించే స్థోమతుందా నీకు?'' అడిగాడు ఆచారి.

''అమ్మాయిని, ఆమె సంతానాన్ని పోషించగలను... కానీ, మిమ్మల్ని, మీ కుటుంబాన్ని పోషించడం మాత్రం కుదరదు!'' అన్నాడు సురేష్.

## జోరుబేరాలు

ఇద్దరు దుకాణదారులు తమ వ్యాపారం గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు-

''మా దుకాణంలో బేరాలు మహా జోరుగా వున్నాయి. రాత్రింబగళ్ళు బేరాలు వుండడంవల్ల మేము తలుపులు మొయ్యటంలేదు!'' అన్నాడు మొదటివాడు.

''మా దుకాణంలో కూడా భలే రద్దీగా వుంది. అందుకే నేను తలుపులు తీయించి పొయ్యిలో పెట్టించేసాను!''

- పి.వి. మురళీకృష్ణ (హైదరాబాద్)

